క్లుప్తంగా

రాష్ట్ర స్థాయిలో జేసీఎస్ నమోదులో ప్రథమ స్థానం



మండల ఇన్‌చార్జిలను అభినందిస్తున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

ప్రత్తిపాడు రూరల్: జగనన్న సచివాలయ గృహ సారథులు నమోదు కార్యక్రమంలో ప్రత్తిపాడు నియోజకవర్గం రాష్ట్ర స్థాయిలోనే ప్రథమ స్థానంలో నిలిచిందని స్థానిక ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ తెలిపారు. మండలంలోని ధర్మవరంలో జగనన్న సచివాలయ గృహ సారథుల మండల ఇన్‌చార్జి రామిశెట్టి చిన బాబు (ప్రత్తిపాడు) సామంతుల చిన్నారావు (ఏలేశ్వరం రూరల్) అలమండ స్వామి (ఏలేశ్వరం టౌన్), బుర్రా లచ్చబాబు (శంఖవరం), రామకుర్తి బాబ్జి (రౌతులపూడి)ని ఎమ్మెల్యే పర్వత ప్రసాద్ దుశ్శాలువాతో సన్మానించి అభినందించారు. రానున్న ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు ఇప్పటి నుంచి కష్టించి పనిచేయాలన్నారు.

పారదర్శకంగా ఓటరు జాబితా



మాట్లాడుతున్న ఎన్నికల అధికారి సుబ్బలక్ష్మి

ప్రత్తిపాడు: వచ్చే ఎన్నికల్లో స్వచ్ఛమైన ఓటరు జాబితా తయారు చేయడానికి రెవెన్యూ యంత్రాంగం కట్టుబడి ఉందని, ప్రత్తిపాడు అసెంబ్లీ ఎన్నికల అధికారిణి, జిల్లా బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్‌వీఎస్ సుబ్బలక్ష్మి తెలిపారు. ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎన్నికల సూపర్‌వైజర్లు, రాజకీయ ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణకై బూత్ లెవెల్ అధికారులు నియోజకవర్గంలోని ప్రతీ ఇంటిని సందర్శించాలన్నారు. 2024 జనవరి నాటికి 18 ఏళ్ళు నిండిన యువతీ యువకులను ఓటరుగా నమోదు చేసేందుకు రాజకీయ పార్టీ నాయకులు బీఎల్ఓలకు సూచన చేయాలని కోరారు. శంఖవరం, రౌతులపూడి తహసీల్దార్లు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శేరు కృష్ణ, గుడాల వెంకటరత్నం, సొసైటీ అధ్యక్షుడు జి.సురేష్, పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను, బీజేపీ నాయకుడు శింగిలిదేవి సత్తిరాజు పాల్గొన్నారు.

ఆర్టీసీ గ్యారేజీలో స్వల్ప ప్రమాదం

గోకవరం: గోకవరం ఆర్టీసీ డిపో గ్యారేజీలో స్వల్ప ప్రమాదం జరిగింది. సోమవారం అర్ధరాత్రి సమయంలో బస్సును రిపేరు చేసే క్రమంలో స్టార్ట్ చేయగా ముందు ఉన్న గోడను ఢీకొట్టింది. దీనిపై ఆర్టీసీ డిపో మేనేజర్ యు.రామన్నను సంప్రదించగా బస్సును స్టార్ట్ చేసిన సమయంలో అదుపు తప్పి ముందు ఉన్న గోడను ఢీకొట్టిందన్నారు. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదన్నారు.

హిందూ ధర్మ రక్షా సమితి ఆందోళన

ప్రత్తిపాడు: హిందూవులపై అక్రమ కేసులు బనాయిస్తున్న చర్చి పాస్టర్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ హిందూ ధర్మ రక్షా సమితి ఆధ్వర్యంలో లంపకలోవ గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. లంపకలోవ గ్రామం నుంచి ర్యాలీగా వచ్చి స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. అక్రమ కేసులు బనాయించిన పాస్టర్, అతని అనుచరులను తక్షణం అరెస్టు చేయాలని నినాదాలు చేశారు. దీనిపై చర్యలు తీసుకుంటామంటూ తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణ హామీ ఇచ్చారు. ఎస్సై ఎం.పవన్‌కుమార్ బందోబస్తు ఏర్పాటు చేశారు. సమితి నాయకులు చేదులూరి గురవయ్య, కర్రి ధర్మరాజు, ఉప్పలపాటి తిరుపతయ్య, బీజేపీ నాయకుడు శింగిలిదేవి సత్తిరాజు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)కి వైద్య పరీక్షలకు వచ్చిన గర్భిణులకు లయన్స్ క్లబ్ సభ్యులు మంగళవారం పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. స్థానిక లయన్స్‌క్లబ్ సభ్యుడు గొంప రామకృష్ణ పౌష్టికాహార కిట్లను సమకూర్చారు. వీటిని గొంప రామకృష్ణ చేతుల మీదుగా 70 మందికి అందజేశారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు ఇంజనీర్ బి మోహన్ ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో సీహెచ్‌సీ ఇన్‌చార్జి రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ (ఆర్ఎంఓ) ఎం.కన్యాకుమారి, సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ డైరెక్టర్ ఏడిద రెడ్డినాయుడు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఇందన ఏసుబాబు, డీవీఎస్ రమేష్‌రాజు, పంతం కృష్ణ, డి.ఫకీర్‌రాజు పాల్గొన్నారు.

విజిలెన్స్ కమిటీ మెంబర్‌గా మల్లి



జగ్గంపేట: జిల్లా సివిల్ సప్లయిస్ విజిలెన్స్ కమిటీ మెంబర్‌గా జగ్గంపేట మండలం గుర్రంపాలెం గ్రామానికి చెందిన ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ఇజ్జిన మల్లిని జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్లా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఎంపి యూత్ వలంటరీ ఆర్గనైజషన్ అధ్యక్షురాలుగా వున్న ఇజ్జిన మల్లి పలు సేవాకార్యక్రమాలు నిర్వహిస్తుంటారు.

ఓం గురుదేవాయనమః

- ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం
- గురువులను సత్కరించిన నాయకులు, అధికారులు, విద్యార్థులు



శంఖవరంలో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే పర్వత



ప్రత్తిపాడులో విశ్రాంత ఉపాధ్యాయులను సత్కరిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

శంఖవరం: గురువును మించిన దైవం లేదని ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురుపూజోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులు ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా ఉత్తమ్మ ఉపాధ్యాయుడిగా ఎంపికైన మండలంలోని ఎస్.జగ్గంపేట ఎంపీపీ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు అచ్చుత రామారావు, మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన అన్నవరం బీసీ కాలనీ ఎంపీపీ పాఠశాల జె.నాగలక్ష్మి, శంఖవరం ఎంపీపీ ఏబీఎస్ పాఠశాల టీచరు జి.రాజు, సిద్ధివారిపాలెం ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయురాలు టి.లక్ష్మిలకు పూలమాల వేసి, శాలువా కప్పి సత్కరించారు. జిల్లా స్థాయిలో మండలం నుండి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఆదర్శపాఠశాల ప్రిన్సిపాల్ కె.కృష్ణవేణి, సివిక్స్ ఉపాధ్యాయుడు కేవీఆర్ కోటేశ్వరరావు, జి.కొత్తపల్లి ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు బొబ్బాది ప్రవీణ్‌కుమార్, కేజీబీవీ బయాలజీ ఉపాధ్యాయులు పి.అరుణకుమారి, పి.మల్లాపురం హైస్కూల్ హిందీ పండిత్ తొంటా రాజులకు అభినందనలు తెలిపారు. ఎంపీపీ పర్వత రాజుబాబు, ఎంపీడీఓ జి.శివరామకృష్ణ, ఎంఈఓ ఎస్.వి.రమణ, ఉపాధ్యాయులు తోట సీతారామయ్య, కె.వెంకటేశ్వరరావు, శెల్లంశెట్టి దేవుళ్ల పాల్గొన్నారు.

ఏలేశ్వరం: గురుపూజోత్సవం నియోజకవర్గ వ్యాప్తంగా మంగళవారం ఘనంగా నిర్వహించారు. పట్టణానికి చెందిన వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు సజ్జ సత్యనారాయణను సన్మానించారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రిటైర్డ్ ఉపాధ్యాయుడు వసంత ప్రసాదరావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో రిటైర్డ్ ఉపాధ్యాయుడు కంచుపట్ల కృష్ణను ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి సన్మానించారు. వైఎస్సార్ సీపీ నేత, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ సామంతుల సూర్యకుమార్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు సిద్ధాంతి ప్రసాద్, కొవ్వాడ శ్రీకాంత్‌లనుసన్మానించారు. పార్టీనాయకులు ఏఎంసీ డైరెక్టర్ పైల విజయ్‌కుమార్, ఎంపీటీసీ సభ్యుడు యిజనగిరి ప్రసాద్, సొసైటీ త్రిసభ్య కమిటీ సభ్యుడు సిరిపరపు రాజేష్, కోరాడప్రసాద్ పాల్గొన్నారు.

కోటనందూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన టీచర్స్ డే వేడుకల్లో ఎంపీపీ లగుడు శ్రీనివాసు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో గురువు పాత్ర ఎంతో కీలకమన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పీఎంసీ చైర్మన్ల ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలతో సత్కరించి సన్మానించారు.

ప్రత్తిపాడు: మండల పరిషత్ కార్యాలయంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి ఎంపీపీ గోళ్ళ కాంతి సుధాకర్ పూలమాల వేసి నివాళులర్పించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జీవిత వృత్తాంతాన్ని ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు వివరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీను, ఈఓఆర్డీ కేవీవీ కాశీ విశ్వనాథం, ఎన్ఆర్‌జీఎస్ ఏపీఓ ఏబీవీ నాయుడు, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు. కాగా ప్రత్తిపాడు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం జరిగింది. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఇంజినీర్ బి. చంద్రమోహన్ ఆధ్వర్యంలో విశ్రాంత ఉపాధ్యాయులు ఆర్.సుజన, కె.చంద్రలీల, సీహెచ్ గ్రేస్ కమలలను లయన్స్‌క్లబ్ ప్రతినిధులు శాలువాలతోనూ, పూలమాలలతోనూ సత్కరించారు. కార్యక్రమంలో మినర్వా అధినేత డీవీఎస్ రమేష్‌రాజు, ధర్మవరం శ్రీరఘురామా కట్ పీసెస్ అధినేత ఇందన ఏసుబాబు, విశ్రాంత మెడికల్ సూపర్‌వైజర్ కె.సంజీవరావు పాల్గొన్నారు.

తుని రూరల్: గురుపూజోత్సవం సందర్భంగా ప్రభుత్వం, ప్రైవేట్ పాఠశాలలు, గురుకుల విద్యాలయాల్లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటాలకు నివాళులు అర్పించారు. మంగళవారం వి.కొత్తూరు కేజీబీవీ, డాక్టర్ అంబేద్కర్ గురుకుం, గిరిజన ఆశ్రమ పాఠశాల, జగన్నాథగిరిలో ఏపీఆర్ స్కూల్, హంసవరం ఏపీ మోడల్ స్కూల్, తదితర విద్యాలయాల్లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి నిర్వహించారు. ఆయన సేవలను వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

తుని: స్థానిక రోటరీ క్లబ్ హాలులో సర్వేపల్లి రాధాకృష్ణ చిత్ర పటానికి తుని రోటరీ క్లబ్ అధ్యక్షుడు వర్మ పూలమాల వేసి నివాళులు అర్పించారు. అధ్యాపకులు పొన్నాడ శ్రీనివాస్, బుద్దిగ జగదీష్‌లను సన్మానించారు. ప్రభుత్వ రాజా ఉన్నత పాఠశాల, సరస్వతీ శిశుమందిర్, చక్కా సూర్యనారాయణ మున్సిపల్ ఉన్నత పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులను సత్కరించారు. రోటరీక్లబ్ కార్యదర్శి కిశోర్‌రెడ్డి, అసిస్టెంట్ గవర్నర్ బుచ్చిరాజు పాల్గొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పలువురు ఉపాధ్యాయులను బీజేపీ తుని శాఖ ఆధ్వర్యంలో మంగళవారం సత్కరించారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఉపాధ్యాయులను పూలమాలలు వేసి శాలువతో సన్మానించారు. బీజేపీ తుని పట్టణశాఖ అధ్యక్షుడు పడాల విశ్వనాథ్, ప్రగడ చక్రరావు, అర్ధనారీశ్వరరావు, చక్రవర్తుల శ్రీనివాస్, కాదంబరి రామకృష్ణ, జగ్గబాబు, నరసింహారావు, పవన్ పాల్గొన్నారు.

జగ్గంపేట: ఇటీవల జిల్లా అధికారుల నుంచి ప్రశంసా పత్రం అందుకున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రనాయుడును అభివృద్ధి కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. డిగ్రీ కళాశాల అభివృద్ధి కమిటీ సెక్రటరీ ఒమ్మి రఘురాం పాల్గొన్నారు.

కిర్లంపూడి: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో మంగళవారం గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. తామరాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం స్థానిక నాయకులు, విద్యార్థులు ఉపాధ్యాయులను సత్కరించారు.

తుని: తుని వాకర్స్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో పలువురు ఉపాధ్యాయులను సత్కరించారు. మంగళవారం స్థానిక బ్యాంక్‌కాలనీ కలిదిండి టవర్స్‌లో ఉపాధ్యాయులు ఎస్. వెంకటేశ్వరరావు, డీవీఎల్ఎన్.ప్రసాద్, శివకుమార్‌లను సన్మానించారు. వాకర్స్ హెల్త్ క్లబ్ గౌరవ అధ్యక్షుడు కలిదిండి సత్యనారాయణ రాజు పాల్గొన్నారు.

రౌతులపూడి: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఎంఈఓ-2 గాడి కొండబాబును రౌతులపూడిలో పలువురు పూర్వ విద్యార్థులు సత్కరించారు.

ఏడుగురికి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు



కలెక్టర్ నుంచి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న సీకోటి అప్పలరాజు



ప్రత్తిపాడులో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయిని ధనలక్ష్మిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే పర్వత



కలెక్టర్, ఎమ్మెల్యేల నుంచి అవార్డు పొందిన ఏపీఆర్ఎస్ ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి



విశాఖలో మంత్రి బొత్స సత్యనారాయణ నుంచి అవార్డు అందుకున్న రాజేశ్వరి



మురారి ఎస్‌జీటీ చక్కా లక్ష్మీదేవిని కాకినాడలో సత్కరిస్తున్న కలెక్టర్ శుక్లా, ఎమ్మెల్యేలు కన్నబాబు, ద్వారంపూడి



మంత్రి బొత్స చేతుల మీదుగా అవార్డు స్వీకరిస్తున్న ఉమాదేవి



కలెక్టర్, ఎమ్మెల్యే నుంచి అవార్డు పొందిన ఏపీఎంఎస్ ప్రిన్సిపాల్ పద్మజ

తుని రూరల్: మండలంలో వివిధ ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో విధులు నిర్వహిస్తున్న ఏడుగురు ప్రిన్సిపాల్‌లు, ఉపాధ్యాయులకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు లభించాయి. మంగళవారం కాకినాడలో జరిగిన గురుపూజోత్సవంలో కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్యేలు ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, కురసాల కన్నబాబు, విద్యాశాఖ అధికారుల చేతులమీదుగా అవార్డులు, ప్రశంసా పత్రాలు అందుకున్నారు. అవార్డులు లభించిన వారిలో జగన్నాథగిరిలో ఏపీ రెసిడెన్సియల్ స్కూల్ ప్రిన్సిపాల్ నక్కా వెంకటలక్ష్మి, హంసవరం ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పి.పద్మజ, వి.కొత్తూరులో గిరిజన ఆశ్రమ పాఠశాల హెచ్ఎం వి.సేవమేరీ, ఉపాధ్యాయులు పప్పు శ్రీనివాస శర్మ (హంసవరం), టి.దేవివరప్రసాద్ (ఎస్.సూరవరం), ఎస్.విమల (తేటగుంట), ఎస్.మాధురి (వి.కొత్తూరు కేజీబీవీ) ఉన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయినికి సత్కారం

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు: మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద మంగళవారం మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత 'రాజాన ధనలక్ష్మి' సన్మాన సభ జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణ చంద్రప్రసాద్ ధనలక్ష్మిని సత్కరించారు. ఎంఈఓ వి రాజబాబు అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఎంపీపీ గోళ్ళ కాంతి సుధాకర్, సర్పంచ్ గుడాల విజయలక్ష్మి, సీఐ శేఖర్‌బాబు, ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు, తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణ ప్రసంగించారు. వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీను, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు రెడ్నం వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు సీంద్రపు భాస్కరరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ శేరు కృష్ణ పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న అప్పలరాజు

కిర్లంపూడి: మండలంలోని గోనేడ ఎంపీపీ ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎంగా విధులు నిర్వహిస్తున్న సీకోటి అప్పలరాజు మంగళవారం కలెక్టర్ కృతికా శుక్లా చేతుల మీదుగా ఉత్తమ జిల్లా ఉపాధ్యాయుడు అవార్డును అందుకున్నారు.

ఉమాదేవికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం

అన్నవరం: రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికైన స్థానిక ఆరెంపూడి ఎంపీపీ ప్రైమరీ స్కూల్ అసిస్టెంట్ రావిపల్లి ఉమాదేవి రాష్ట్ర విద్యాశాఖా మంత్రి బొత్సా సత్యనారాయణ చేతుల మీదుగా మంగళవారం అవార్డు స్వీకరించారు. విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీ కన్వెన్షన్ హాలు లో జరిగిన కార్యక్రమంలో ఆమెకు ఈ అవార్డును అందచేశారు. భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి (అవంతి) శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న కేజీబీవీ ప్రిన్సిపాల్

తొండంగి: రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును మండలంలోని కేజీబీవీ ప్రిన్సిపాల్ ఎం.రాజేశ్వరీ మంగళవారం విశాఖలో జరిగిన కార్యక్రమంలో విద్యాశాఖ మంత్రి బోత్స సత్యనారాయణ చేతుల మీదుగా అందుకున్నారు.

రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ ఆకస్మిక తనిఖీ



సీఐ, ఎస్సైలతో మాట్లాడుతున్న ఎస్పీ సతీష్‌కుమార్

తుని రూరల్: జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ తుని రూరల్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. మంగళవారం వచ్చిన ఆయన రికార్డులను తనిఖీ చేసి పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ సన్యాసిరావు, ఎస్సై విజయబాబులకు పలు సూచనలు చేశారు. ఫిర్యాదుదారులతో స్టేషన్ సిబ్బంది మర్యాదగా వ్యవహరించాలని, స్టేషన్ పరిసరాల నిర్వహణ ఆరోగ్యకర వాతావరణంలో ఉండాలన్నారు. మహిళా హెల్ప్ డెస్క్‌లో విధిగా మహిళా పోలీసు సిబ్బంది ఉండాలన్నారు. స్టేషన్ హౌస్ అధికారి, సిబ్బంది గ్రామాల్లో వారధి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రత్యేక వ్యవస్థ ద్వారా గ్రామాల్లో శాంతిభద్రతలకు సంబంధించిన అంశాలు, అసాంఘిక కార్యకలాపాల వ్యవహారాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

సాగునీటి ఇబ్బంది లేకుండా చర్యలు

తొండంగి: మండలంలోని పీబీసీ ఆయకట్టు పరిధిలో వరిపొలాలకు సాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖాధికారి ఎస్.విజయ్‌కుమార్ అన్నారు. వర్షాలు లేక కొద్ది రోజుల క్రితం ఆయకట్టులో శివారు పొలాలు ఎండిన నేపథ్యంలో మంగళవారం ఆయన అధికారులతో కలిసి రావికంపాడు, ఏ.వి.నగరం ప్రాంతాల్లో పరిశీలించారు. ఎగువ ప్రాంతాల్లో వర్షాల రాకతో పీబీసీ కాలువ నీరు సమృద్ధిగా వస్తుందని, వరిసాగుకు ఇబ్బంది లేదని స్థానిక రైతులు అధికారులకు వివరించారు. భవిష్యత్తులో కూడా ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఏ.వి.నగరంలోని రైతు భరోసా కేంద్ర భవన నిర్మాణాన్ని పరిశీలించారు. మండలంలోని అన్ని భవనాల నిర్మాణం త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. తుని ఏడీఏ సుంకర బుల్లిబాబు, నోడల్ అధికారి ప్రశాంతి, మండల వ్యవసాయశాఖాధికారి ఎస్.నరసింహం, ఏఓ పద్మజ, ఏఈఓ కొప్పన దైవప్రసాద్, గ్రామ సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్లు ఉన్నారు.

అల్పపీడన ప్రభావంతో కుండపోత వర్షం

తొండంగి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మంగళవారం మండలంలో కుండపోత వర్షం కురిసింది. సాయంత్రం ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కుండపోతగా సుమారు రెండు గంటల పాటు కురిసింది. దీంతో పల్లపు ప్రాంతాల్లోని రోడ్లు స్వల్పంగా జలమయమవడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. కాగా వ్యవసాయపరంగా సరైన వర్షాలు లేక ఇబ్బందులు పడుతున్న రైతులకు ఈ వర్షాలు ఊరటనిస్తున్నాయి. దీంతో పంపా, పీబీసీ ఆయకట్టు పరిధిల్లో వరినాట్లు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటికే పీబీసీ ఆయకట్టులో నాట్లు వేయడం దాదాపుగా పూర్తికావస్తుంది. కాగా అద్దరిపేట, పెరుమాళ్లపురం, దానవాయిపేట, కొత్తపోడిపల్లిపేట, యర్రయ్యపేట తదితర సముద్ర తీరాల్లో అలలు రెండు మీటర్లు వరకూ ఎగసిపడుతున్నాయి. మత్స్యకారులు ప్రతికూల వాతావరణంలో వేటకు వెళ్లొద్దని తుని మత్స్యశాఖ అభివృద్ధి అధికారి ఉమామహేశ్వరరావు తెలిపారు.

ఆధార్‌కు అనుసంధానం చేసుకోవాలి

జగ్గంపేట: విద్యుత్ వినియోగదారుల తమ సర్వీసులను, పేర్లను ఆధార్‌కు అనుసంధానం చేసుకోవాలని జగ్గంపేట ఎలక్ట్రికల్ డీఈ రత్నాలరావు తెలిపారు. విద్యుత్ సిబ్బంది ప్రతి ఇంటికి వచ్చి ఈ కార్యక్రమం చేపడతారని, దీనికి వినియోగదారులు సహకరించాలని అన్నారు. ఇప్పటికే అగ్రికల్చరల్ వినియోగదారులు దాదాపుగా ఆధార్ అనసంధానం చేసుకున్నారని తెలిపారు. డివిజన్ పరిధిలో ఆధార్ అనుసంధానం కార్యక్రమం ఈ నెల 10 వరకూ జరగనుందని డీఈ రత్నాలరావు తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



ఒమ్మంగిలో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న జేసీఎస్ మండల ఇన్‌చార్జి చినబాబు

ప్రత్తిపాడు రూరల్: కుల, మత రాజకీయాలకు అతీతంగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తామని వైఎస్సార్ సీపీ జేసీఎస్ మండల ఇన్‌చార్జి రామిశెట్టి చిన బాబు అన్నారు. మండలంలోని ఒమ్మంగిలో గ్రామ సచివాలయ అధికారులతో కలిసి నూతనంగా మంజూరైన పింఛన్లను ఆయన చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలో నూతనంగా మంజూరైన 211 ఫించన్లను లబ్ధిదారులకు పంపిణీ చేసినట్లు తెలిపారు.

ఆరుతడి పంటలపై దృష్టి



బిళ్లనందూరులో రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి విజయ్‌కుమార్

కోటనందూరు: వర్షాభావ పరిస్థితుల్లో రైతులు ఆరుతడి పంటలపై దృష్టి సారించాలని వ్యవసాయశాఖ జేడీ ఎన్.విజయ్‌కుమార్ సూచించారు. మంగళవారం మండలంలోని బిళ్లనందూరులో వరినాట్లు పడని పంటభూమిని ఆయన పరిశీలించారు. నాట్లు పడకపోవడంపై అక్కడ రైతులతో చర్చించారు. వరుణుడు కరుణించకపోవడం, తాండవలో అంతంత మాత్రంగా నీటి నిల్వలు ఉండడంతో ఆరుతడి పంటలైన మినుము, పెసర చిరుధాన్యాలు రాగి, కొర్రలను వెదజల్లు పద్ధతిలో సాగు చేస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రాయితీపై అందిస్తున్న ఆరుతడి, చిరు ధాన్యాల విత్తనాలను సద్వినియోగం చేసుకొని సాగు చేయాలన్నారు. ఏడీఏలు ప్రశాంతి, సుంకర బుల్లిబాబు, ఏఓ చంద్రశేఖర్, ఏఈఓ శివకుమారి, రైతులు పాల్గొన్నారు.

కొత్త పింఛన్ల పంపిణీ



ఏలేశ్వరంలో లబ్ధిదారుడికి నూతన పింఛన్ అందజేస్తున్న కౌన్సిలర్ రామలక్ష్మి

ఏలేశ్వరం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేస్తున్నారు. దీనిలో భాగంగా ఈ నెల నూతన పింఛన్లు లబ్ధిదారులకు అందజేశారు. పట్టణ పరిధిలోని 7వ సచివాలయంలో మంగళవారం వైఎస్సార్ సీపీ నేత, మున్సిపల్ కౌన్సిలర్ కోరాడ రామలక్ష్మి నూతన పింఛన్లు లబ్ధిదారులకు అందజేశారు. ఆమె మాట్లాడుతూ సీఎం జగన్ ఇచ్చిన మాట ప్రకారం నూతన పింఛన్లు మంజూరు చేయడం హర్షణీయమన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలందరూ సీఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయడం ద్వారా అనేక సంక్షేమ పథకాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత కోరాడ ప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చేతుల మీదుగా..

గోకవరం: గోకవరం మండలంలో 14 పంచాయతీల్లో నూతనంగా మంజూరైన పింఛన్లను బుధవారం ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు చేతుల మీదుగా పంపిణీ చేస్తామని ఎంపీపీ సుంకర శ్రీవల్లి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలానికి 312 పింఛన్లు మంజూరయ్యాయని, వీటిని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేస్తారన్నారు. మండలంలోని అన్ని పంచాయతీల సర్పంచ్‌లు, వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలన్నారు.


సమన్వయంతో అభివృద్ధికి కృషి చేయాలి

- విద్యుత్‌శాఖ తీరుపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం

ప్రత్తిపాడు: ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణ చంద్రప్రసాద్ కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ గోళ్ళ కాంతి సుధాకర్ అధ్యక్షతన మంగళవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. గ్రామాలలో నెలకొన్న సమస్యలను ప్రజాప్రతినిధులు గుర్తించి, వాటి పరిష్కారం కోసం అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో విద్యుత్‌శాఖ పనితీరుపై ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రత్తిపాడులో ప్రధాన సమస్యగా ఉన్న ఆరు ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తామని చెప్పి, నెలలు గడుస్తున్నా ఆ ఊసే లేదని సర్పంచ్ గుడాల విజయలక్ష్మి అన్నారు. తరచు నిలిచిపోతున్న కరెంటు సమస్య తెలియజేసేందుకు విద్యుత్ శాఖ సిబ్బందికి ఫోన్ చేస్తున్నా స్పందించడం లేదని ప్రత్తిపాడు ఎంపీటీసీ సీంద్రపు భాస్కరరావు, చినశంకర్లపూడి ఎంపీటీసీ పిల్లా కొండలరావు (చిన్న) ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్దండ జగన్నాథపురంలో 2022 మే నెలలో విద్యుత్ శాఖకు రూ. 2.65 లక్షలు చెల్లించినప్పటికీ ఇంకా పనులు పూర్తి చేయలేదని సర్పంచ్ నడిగట్ల త్రిమూర్తులు తెలిపారు. పది రోజులుగా కాకినాడ-వాకపల్లి ఆర్టీసీ బస్సు నిలిచిపోయిందని వాకపల్లి సర్పంచ్ రొంగల నాగేశ్వరరావు తెలిపారు. గ్రామంలో తాగునీటి ఇబ్బందుల దృష్ట్యా రెండు చేతిపంపులు ఏర్పాటు చేయాలని చింతలూరు ఎంపీటీసీ సభ్యురాలు షర్మిల కోరారు. ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు, వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీను పాల్గొన్నారు. గ్రామంలోని రూ.6 లక్షలు మండల పరిషత్ నిధులతో నిర్మించిన క్వారీ రోడ్డును, మాదిగ పేటలో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణ చంద్ర ప్రసాద్ ప్రారంభించారు. ఎంపీపీ గోళ్ళ కాంతి సుధాకర్, సర్పంచ్ గుడాల విజయలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు రెడ్నం వెంకటేశ్వరావు, పత్రి రమణ, ఆకుల వీరబాబు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలపై ఈఓపీఆర్డీ విచారణ

సాక్షి ఇంపాక్ట్



పంచాయతీ కార్యదర్శి, ఎంపీటీసీ సభ్యుల నుంచి సమాచారం సేకరిస్తున్న విచారణాధికారి సత్యారెడ్డి

సామర్లకోట: పీబీ దేవం ప్రైవేటు పాఠశాలపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి గతంలో ఏర్పాటు చేసిన ద్విసభ్య కమిటీ సభ్యులు ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య, ఈఓ పీఆర్డీ హిమమహేశ్వరి 11 తప్పులను గుర్తించినట్టు ప్రస్తుత ఈఓ పీఆర్డీ కర్రి హరికృష్ణ సత్యారెడ్డి అన్నారు. 'ప్లాను లేదు.. పన్ను చెల్లించరు' అనే శీర్షికతో సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనంపై కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశాల మేరకు డీఎల్‌పీఓ, ఈఓ పీఆర్డీ విచారించాల్సి ఉంది. అయితే డీఎల్‌పీఓ ఎన్నికల విధులలో ఉండటంతో ఈఓ పీఆర్డీ ఒక్కరే పంచాయతీ కార్యాలయంలో విచారణ చేశారు. ఎంపీటీసీ సభ్యుడు మలకల సూరిబాబు, సర్పంచ్ నీలపాల సత్యనారాయణ, కార్యదర్శి రామ్‌నాథ్‌ల నుంచి వివరాలు సేకరించారు. త్రివర్ణ పబ్లిక్ స్కూల్ కొడా అనుమతులు లేకుండా నిర్మించడంతో పాటు పాఠశాలకు ఎన్ఓసీ లేదని వివరిస్తూనే, నిర్మాణంలో 11 తప్పులున్నట్టు అప్పటి కమిటీ ఇచ్చిన నివేదిక నకలును వారు ఎంపీడీఓ డి.శ్రీలలితకు అందజేశారు. స్కూల్ రెన్యూవల్‌కు అనుమతి ఇవ్వడానికి వీలులేదని 2020 లోనే పంచాయతీ తీర్మానం చేసినా అప్పటి ఎంఈఓ పంచాయతీ తీర్మానాన్ని లెక్క చేయకుండా రెన్యూవల్ చేశారని సూరిబాబు విచారణాధికారికి తెలిపారు. విచారణలో గుర్తించిన అంశాలను కలెక్టర్‌కు వివరిస్తానని విచారణాధికారి సత్యారెడ్డి తెలిపారు. డీఎల్‌పీఓ వచ్చిన తరువాత మరో పర్యాయం పూర్తి స్థాయి విచారణ చేస్తామన్నారు.

సారా విక్రయదారుడి అరెస్ట్

గండేపల్లి: నాటు సారా విక్రయదారుడుని అరెస్ట్ చేసినట్టు ఎస్సై వై.గణేష్‌కుమార్ తెలిపారు. ఆయన వివరాల మేరకు మండలంలోని సుబ్బయమ్మపేట గ్రామ శివారులో అంబటి సత్యనారాయణ అక్రమంగా నాటు సారా విక్రయిస్తున్నట్టు అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడి జరిపి అతని వద్ద నుంచి ఐదు లీటర్ల సారాను స్వాధీన పరుచుకుని అతనిపై కేసు నమోదుచేసి రిమాండ్ నిమిత్తం పెద్దాపురం కోర్టుకు తరలించినట్టు తెలియజేశారు.